ANDHRAJYOTHY

ఆంధ్రజ్యోతి



వికారాబాద్ - మేడ్చల్

జిల్లాల వార్తలు

5

ఆదివారం 17 ఆగస్టు 2025





తాండూరులో చిన్నికృష్ణుడు, వికారాబాద్‌లో గోపిక

గోకుల కృష్ణా.. గోపాల కృష్ణా..



ధారూరు: కోలాటం ఆడుతున్న విద్యార్థులు



శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను జిల్లా వ్యాప్తంగా శనివారం ఘనంగా జరుపుకున్నారు. ఆలయాలకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. చిన్నారులు శ్రీకృష్ణ, గోపిక వేషధారణలో అలరించారు. సాయంత్రం గ్రామాల్లో యువకులు ఉట్లు కొట్టి సంబురాలు జరుపుకున్నారు.

- ఆంధ్రజ్యోతి నెట్‌వర్క్, ఆగస్టు 16



పూడూరు: సోమన్‌గుర్తిలో ఉట్టికొడుతున్న చిన్ని కృష్ణుడు



మర్పల్లి: గోపిక వేషధారణలో చిన్నారి



నలుగురిపై
వీధికుక్కల దాడి

తీవ్ర గాయాలతో ఆసుపత్రికి..

బషీరాబాద్ మండలంలో ఘటన

బషీరాబాద్, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఇందిరానగర్‌లో వీధి కుక్కలు స్వైరవిహారం చేస్తున్నాయి. పగలు, రాత్రి తేడా లేకుండా వీధుల్లో గుంపులుగా తిరుగుతూ స్థానికులపై తిరుగబడుతున్నాయి. శనివారం ఒక్క రోజు ఇద్దరు చిన్నారులు, ఇద్దరు మహిళలపై దాడి చేశాయి. చిన్నారులు విక్రాంత్(4), నరేశ్(8), ఆసియాబేగం(22), కర్ణాటకకు చెందిన ఓ మహిళను చేతులు, వీపుపై, పిక్కలపై తీవ్రంగా గాయాలు చేశాయి. బాధితులను స్థానిక ఆసుపత్రికి తరలించి చికిత్సలు చేయించారు. ఓ మహిళల పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌కు తరలించారు. ఈ కాలనీలో రోడ్లపైకి రావాలంటే ఎక్కడా కుక్కలు దాడి చేస్తాయోనని స్థానికులు భయభ్రాంతులకు గురవుతున్నారు. ఇదంతా తెలిసినా పంచాయతీ అధికారులు పట్టించుకోవడంలేదని, బాధిత కుటుంబాల సభ్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



చిన్నారి చెంపపై కుక్కకాటు

తీరిన లోటు..
పెరిగిన సాగు

విస్తారంగా వర్షాలు.. ఊపందుకున్న వ్యవసాయం

ఉమ్మడి జిల్లాలో భారీగా కురుస్తున్న వర్షాలతో వానాకాలం సాగు కుదుటపడింది. అన్ని ప్రాంతాల్లో వ్యవసాయ పనులు జోరుగా సాగుతున్నాయి. అలాగే పలు పంటల సాగు అనూహ్యంగా పెరిగింది. రంగారెడ్డి, వికారాబాద్, మేడ్చల్ జిల్లాల్లో సగటుకు మించి వర్షపాతం నమోదైంది. వికారాబాద్‌లో 81శాతం, రంగారెడ్డిలో 72శాతం, మేడ్చల్‌లో 65 శాతం చొప్పున రైతులు పంటలు సాగు చేశారు. కాగా, వికారాబాద్‌లో పత్తి, రంగారెడ్డిలో మొక్కజొన్న రికార్డు స్థాయిలో సాగు చేశారు.

మూడు జిల్లాల్లో సగటుకు మించి వర్షపాతం

వికారాబాద్‌లో జిల్లాలో రికార్డు స్థాయిలో 2.5లక్షల ఎకరాల్లో పత్తి సాగు

రంగారెడ్డి జిల్లాలో సగటుకు మించి మొక్కజొన్న..

హర్షం వ్యక్తం చేస్తున్న రైతులు

అధిక వర్షపాతం వివరాలు

జిల్లా	అధికం(శాతం)
రంగారెడ్డి	61
వికారాబాద్	33
మేడ్చల్	23

పంటల సాగు

జిల్లా	శాతం
రంగారెడ్డి	72
వికారాబాద్	81
మేడ్చల్	65



పరిగిలో వర్షాలకు ఏపుగా పెరిగిన పత్తి చేను

(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డిజిల్లా ప్రతినిధి): ఉమ్మడి జిల్లాలో గడిచిన మూడు వారాలుగా విస్తారంగా వర్షాలు కురుస్తున్న సంగతి తెలిసిందే. రంగారెడ్డి జిల్లాలో సగటుకు మించి 62 శాతం అధిక వర్షాలు కురిశాయి. అలాగే వికారాబాద్, మేడ్చల్ జిల్లాల్లో కూడా నగటు మించి వర్షాలు పడ్డాయి. ఈ కారణంగా పలు పంటల సాగు గణనీయంగా పెరిగింది. గత జులై 15వ తేదీ వరకు మూడు జిల్లాల్లో భారీగా లోటు వర్షపాతం నమోదు కావడంతో రైతులు ఆందోళన చెందారు. రైతులు విత్తనాలు, ఎరువులు సిద్ధం చేసుకున్నప్పటికీ వర్షాలు లేకపోవడంతో పనులు ముందుకు సాగలేదు. గడిచిన ఆరేళ్లలోనే కనిష్ట వర్షపాతం నమోదకావడంతో రైతులంతా ఈ వానాకాలం

మిగతా 7వ పేజీలో...





కళకళలాడుతున్న మొక్కజొన్న చేను

వర్షపాతం జిల్లాల వారీగా (మి.మీలలో)

జిల్లా	కురువాల్సింది	కురిసింది
రంగారెడ్డి	318	516
వికారాబాద్	390	515
మేడ్చల్	357	440

టీబీ ముక్త్ భారత్‌కు బాధ్యతగా కృషి చేయాలి

రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ

అనంతగిరిలో 3వ తెలంగాణ క్షయ, ఛాతీవ్యాధుల సదస్సు



బ్రోచర్ ఆవిష్కరిస్తున్న గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, స్పీకర్ ప్రసాద్‌కుమార్

వికారాబాద్, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): టీబీ ముక్త్ (క్షయ) భారత్ కోసం ప్రతి ఒక్కరూ బాధ్యతగా కృషి చేయాలని రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ పిలుపునిచ్చారు. వికారాబాద్ జిల్లా, అనంతగిరిలోని హరిత రిసార్ట్‌లో రెండు రోజుల పాటు కొనసాగనున్న 3వ తెలంగాణ క్షయ వ్యాధులు, ఛాతీవ్యాధుల సదస్సు (టీజీటీసీసీవోఎస్-2025) ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పురాతన కాలంలో క్షయ వ్యాధి నివారణకు మందులు అందుబాటులో లేవని, ప్రస్తుతం చాలా రకాల మందులు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. సబ్‌కా ప్రయాస్ సబ్‌కా వికాస్ అని.. క్షయ వ్యాధి నివారణలో అందరూ కష్టపడితేనే ఆరోగ్యంగా ఉంటారన్నారు. క్షయ వ్యాధి నిర్మూలన కార్యక్రమాల్లో రాజకీయ నాయకులు, కవులు, కళాకారులు, అవార్డు గ్రహీతలను భాగస్వామ్యం చేస్తూ క్షయ వ్యాధి నిర్మూలనపై ప్రజలకు

మిగతా 7వ పేజీలో...

నేడు తాండూరులో జిల్లాస్థాయి అథ్లెటిక్ పోటీలు

తాండూరు, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): వికారాబాద్ జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం(నేడు) తాండూరు పట్టణం విలియమూన్ మైదానంలో జిల్లా స్థాయి జూనియర్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ -2025 పోటీలు నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ ఉపాధ్యక్షుడు లొంక నర్సిములు తెలిపారు. ఆయన శనివారం తాండూరులో వివరాలను వెల్లడించారు. అండర్ -14, 16, 20 విభాగాల్లో 60 మీటర్లు, 100 మీటర్లు, 200 మీటర్లు, 400 మీటర్లు, 800 మీటర్లు, 1,500మీ. 3,000 మీటర్ల పరుగు పందెం, హైజంప్, లాంగ్ జంప్, షాట్‌పుట్ పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఉదయం 8 గంటలకు ఈ పోటీలు ప్రారంభమవుతాయన్నారు. వివరాల కోసం చైతన్య జూనియర్ కళాశాల పీఈటీ రాము(6300075229), పీఈటీ రాములు (9951343432)ను సంప్రదించాలన్నారు. ప్రతిభ కనబర్చిన క్రీడాకారులకు బహుమతులు, సర్టిఫికెట్స్‌ను అందజేయనున్నట్లు వెల్లడించారు. అలాగే విజేతలకు 30, 31వ తేదీల్లో మహబూబ్‌నగర్‌లో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలో పాల్గొనే అవకాశం ఉంటుందన్నారు.



మహిళా సంఘాల సభ్యులకు చెక్కు అందిస్తున్న మంత్రి సీతక్క, మంత్రి లక్ష్మణ్, చీఫ్‌విప్ మహేందర్‌రెడ్డి

మహిళలకు రూ.26 వేల కోట్ల రుణాలు

పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క

చించల్‌పేట్‌లో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన

నవాబుపేట, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): మహిళా సంఘాలకు రూ.26 వేల కోట్ల రుణాలు అందించినట్లు పంచాయతీరాజ్ శాఖ మంత్రి ధనసరి అనసూయ(సీతక్క) తెలిపారు. శనివారం నవాబుపేట మండలం చించల్‌పేట్ గ్రామంలో పలు అభివృద్ధి పనులకు ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, చీఫ్‌విప్ పట్నం మహేందర్‌రెడ్డి, చేవేళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్యతో కలిసి ప్రారంభోత్సవాలు చేశారు. గ్రామంలో రూ.15లక్షలతో అంగన్‌వాడీ భవనం, రూ.20లక్షలతో బీసీ కమ్యూనిటీ హాల్, రూ.20లక్షలతో పశు వైద్య ఉపకేంద్రం, రూ.20లక్షలతో డ్వాక్రా భవనం, రూ.30లక్షలతో ఎస్సీ కమ్యూనిటీ హాల్, రూ.20లక్షలతో ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రం, రూ.20 లక్షలతో పంచాయతీ భవనాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి సీతక్క మాట్లాడుతూ గత ప్రభుత్వం పావలా వడ్డీ సైతం అందించలేదన్నారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం మహిళా సంఘాలకు వడ్డీ లేని రుణాలు అందిస్తున్నట్లు తెలిపారు. 15 ఏళ్ల నుంచి 60 ఏళ్ల వయసున్న మహిళలు సైతం సంఘాల్లో సభ్యత్వం తీసుకునేందుకు వీలు కల్పించామన్నారు. ప్రతీ పేదవాడు సన్న బియ్యంతో భోజనం చేయాలనే ఉద్దేశంతో సీఎం రేవంత్‌రెడ్డి రేషన్ దుకాణాల ద్వారా లబ్ధిదారులకు సన్న బియ్యం పంపిణీ చేస్తున్నారన్నారు.


పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ మాట్లాడుతూ చేవేళ్ల నియోజకవర్గంలోని చించల్‌పేట్ గ్రామం పెద్ద మొత్తంలో

మిగతా 8వ పేజీలో...

నాగారం, ఘట్‌కేసర్‌లో
భారీ వర్షం

» అలుగు పారుతున్న నందివాగు ప్రాజెక్టు



అలుగు పారుతున్న నందివాగు ప్రాజెక్టు

కీసర రూరల్, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): నాగారం, దమ్మాయిగూడ మున్సిపాలిటీల్లో శుక్రవారం భారీ వర్షం కురిసింది. ఈ వర్షానికి నాగారం మున్సిపాలిటీలోని పలు కాలనీలు జలమయంగా మారాయి. ఎగువ ప్రాంతమైన దమ్మాయిగూడ నుంచి వరద ఉధృతంగా ప్రవహించింది. నాగారం మున్సిపాలిటీలోని రాంపల్లి చౌరస్తాలోని ప్రధాన రహదారిలో అడుగు లోతుతో వరద ప్రవహించింది. దీంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగింది. వాహన దారులు తీవ్ర ఇబ్బంది పడ్డారు. ఏటా వర్షాకాలంలో వరద సమస్య తలెత్తు తుండటంతో

మిగతా 8వ పేజీలో...

కమ్యూనిస్టులంతా ఒకే ఎజెండా కిందకు రావాలి

సీపీఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాంబశివరావు

తాండూరు, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): కమ్యూనిస్టులంతా ఒకే ఎజెండా కిందికి రావాలని సీపీఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు పిలుపునిచ్చారు. శనివారం వికారాబాద్ జిల్లా తాండూరు సమద్ ఫంక్షన్ హాల్‌లో జరిగిన సీపీఐ జిల్లా మహాసభలో ఆయన మాట్లాడారు. దేశాన్ని సరిహద్దుల్లో జవాన్లు రక్షిస్తుంటే దేశంలో సమాజాన్ని ఎర్ర జెండా సైనికులు రక్షిస్తున్నారని అన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీతో పొత్తు ఉన్నప్పటికీ సమస్యలపైన పోరాటం చేస్తునే ఉన్నామన్నారు. బీజేపీ మతతత్వ పార్టీని ఎదగకుండా ఉండేందుకే అవసరమైన పక్షంలో పొత్తులు పెట్టుకుంటున్నామని చెప్పారు. సమావేశంలో సీపీఐ జాతీయ కౌన్సిల్ సభ్యురాలు పశ్య పద్మ, జిల్లా సీపీఎం కార్యదర్శి న్యాయవాది విజయలక్ష్మి పండిత్, నాయకులు వెంకటేష్, పీర్ మహ్మద్, తదితరులు పాల్గొన్నా రు. ఈ సభలో జిల్లా సీపీఐ కార్యదర్శిగా మరోసారి విజయలక్ష్మి పండిత్‌ను ఎన్నుకున్నారు.

రీయింబర్స్‌మెంట్‌పై ఒత్తిడి తేవాలి

పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను, ఉపకార వేతనాలపై ప్రభుత్వంతో చర్చలు జరిపి వెంటనే సమస్యను పరిష్కరించేలా చొరవ చూపాలని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్, ఎఐఎస్ఎఫ్ జిల్లా నాయకులు సుదర్శన్, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావుకు వినతిపత్రం అందజేశారు. రాష్ట్ర వ్యాప్తంగా రూ.800 కోట్లు పెండింగ్‌లో

మిగతా 8వ పేజీలో...



మహాసభలో మాట్లాడుతున్న సాంబశివరావు



'కోట్‌పల్లి'లో తిరంగా బోట్ ర్యాలీ

వికారాబాద్ జిల్లా ధారూరు మండల పరిధిలోని కోట్‌పల్లి ప్రాజెక్టు నీటిలో శనివారం తిరంగా బోట్ ర్యాలీ నిర్వహించారు. జేకేఎంఆర్, ప్రోగ్రెసివ్ తెలంగాణ ఫౌండేషన్ల ఆధ్వర్యంలో కయాకింగ్ బోటింగ్ సిబ్బంది బోట్‌లలో జాతీయ జెండాలతో ప్రాజెక్టు నీటిలో ర్యాలీ చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ కో ఆర్డినేటర్ రాములు, కయాకింగ్ బోటింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

-ధారూరు, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి)

వర్షాకాలం.. వ్యాపిస్తున్న విష జ్వరాలు

● పెరుగుతున్న సీజనల్ వ్యాధుల పీడితులు

మేడ్చల్, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో ముసురు వర్షాలు కురుస్తున్నాయి. గుంతలు, మురుగు కాల్వల్లో, రహదారుల పక్కన నిలిచే నీరు దోమలకు ఆవాసంగా మారుతున్నాయి. ఈగలు,దోమలకు తోడు వర్షాకాలంలో సహజంగా వచ్చే జలుబు, విష జ్వరాలు జడలు విప్పుతున్నాయి. వానాకాలంలో గాలిలో తేమశాతం ఎక్కువ. ఇది బ్యాక్టీరియా, వైరస్‌లు, ఫంగస్, దోమలు వృద్ధికి అనువైన కాలం. మనుషుల రోగ నిరోధక శక్తి బలహీనపడుతుంది. ఇప్పటికే ఆస్పత్రులు జ్వారాలు, డెంగీ వంటి వారితో నిండుతున్నాయి.



రోగాల లక్షణాలు ..

వర్షాకాలంలో డెంగీ, మలేరియా, చికెన్ గున్యా, ఉదర ఇన్ఫెక్షన్లు, లెప్టోస్పిరోసిస్, కలరా, టైఫాయిడ్, వైరల్ ఫీవర్, అతిసార, ఇన్‌ఫ్లూయెంజ వంటి జబ్బులు సోకుతాయి. వీటివల్ల దీర్ఘకాలిక జ్వరం, దద్దుర్లు, తలనొప్పి, ప్లేట్లెట్ తగ్గడం, సున్నితత్వం, వాపులు, అలసట, చలి, కీళ్లనొప్పి, వొళ్లు నొప్పులు, చెమట పట్టడం, తీవ్ర రక్తహీనత, లో-బీపీ, కండరాల తిమ్మిర్లు, దాహం వేయడం, చర్మం పాలిపోవటం, హృదయ స్పందన రేటు పెరుగుదల, బలహీనత, వాంతులు, మలబద్ధకం, ఫారింక్స్ వాపు, లూస్ మోషన్స్, వికారం, మలంలో రక్తం, ముక్కు దిబ్బడ, గొంతు మంట, నిరంతర దగ్గు, కళ్లు ఎరుపు వంటి లక్షణాలు కనిపిస్తాయి.

వ్యాధులకు కారణాలనేకం ...

వర్షాకాలంలో అత్యంత సాధారణ వ్యాధి డెంగీ, మంచినీటి నిల్వలో వృద్ధిచెందే టైగర్ దోమ కారణంగా వ్యాపిస్తుంది. వీటిలో పులి ఏడెస్ అల్బోపిక్టస్ వల్ల చికున్‌గున్యా వస్తుంది. సహజంగా వానాకాలంలో పరిసరాల్లో నీటి నిల్వలుంటాయి. దోమకాటు వల్ల మలేరియా ప్రబలుతుంది. కలుషితాహారం, నీటి కారణంగా వివిధ వ్యాధులు సోకుతాయి. వాటిల్లో టైఫాయిడ్ ఒకటి. సాధారణ ఆరోగ్య సమస్యల్లో ఒకటైన అతిసార సైతం వీటి కారణంగా వస్తుంది. రోగం ముదిరితే ప్రాణాపాయానికి దారితీస్తుంది. మరోవైపు కడుపు ఇన్ఫెక్షన్లకు అపరిశుభ్ర ఆహారం, బయటి పదార్థాలు, కలుషిత ద్రవపదార్థాలు కారణం.గ్యాస్ట్రోఎంటెరిటిస్ అనేది ఈ సీజన్‌లో వచ్చే ఇన్ఫెక్షన్. వైరల్ జ్వరం ఏడాది పొడవునా వస్తున్నా వర్షాకాలంలో ఎక్కువ ప్రబలుతుంది. వాతావరణ మార్పులు, ఉష్ణోగ్రతల హెచ్చుతగ్గులతో ఇన్‌ఫ్లుయెంజా సోకుతు ంది. వైరల్ ఇన్ఫెక్షన్లు ఒకరి నుంచి మరొకరికి సోకే ప్రమాదముంది. వృద్ధులు, అస్తమా బాధితులు, పిల్లల్లో ఊపిరితిత్తుల సమస్య తలెత్తుతున్నాయి. అసాధారణ బ్యాక్టీరియాతో లెప్టోస్పిరోసిస్ వ్యాధి వస్తుంది. ఇది జంతువుల నుంచి మానవులకు సోకుతుంది. శరీరంపై గాయాలు, కోతలున్నట్లయితే బయటకు వెళ్లేప్పుడు వాటిని కప్పి ఉంచుకోవాలి. ఏ వైరల్ ఫీవర్ సోకినా రోగి శరీరంలో ప్లేట్‌లెట్లు తగ్గుతాయి. వెంటనే ఆస్పత్రిలో చేరి చికిత్స పొందాలి.

జాగ్రత్తలు తీసుకోవాలి

వర్షాకాలంలో కీటక, నీటిజనిత వ్యాధులు ఎక్కువ సంభవిస్తాయి. వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత తప్పక పాటించాలి. దోమల వృద్ధిని అరికట్టాలి. ఇళ్లలో దోమ తెరలు, లేపనాలు వాడాలి. నీటి గుంతల్లో కిరోసిన్ చల్లాలి. పరిసరాల్లో మురుగునీరు నిలవకుండా చూసుకోవాలి. కలుషిత ఆహారం, నీరు తీసుకోకూడదు. రోగ నిరోధకశక్తిని పెంచే ఆహారం భుజించాలి. వేడి చేసి చల్లార్చిన నీరే తాగాలి. చల్లటి పదార్థాలు తినొద్దు.

- ఉమాగౌరి, జిల్లా వైద్యాధికారి



దుస్తులు అందజేస్తున్న నిఖిల కన్‌స్ట్రక్షన్స్ ఎండీ శ్రీనివాసరావు

పేదలకు దుస్తులు అందజేసిన నిఖిల కన్‌స్ట్రక్షన్స్ ఎండీ

శంకర్‌పల్లి, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ పేదలకు సహాయం చేయాలని వివంటా గ్రీన్ మిడోస్, నిఖిల కన్‌స్ట్రక్షన్స్ ఎండీ శ్రీనివాసరావు అన్నారు. స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని చందిప్పలో పేదలకు దుస్తులను అందజేసి, అన్నదానం నిర్వహించారు. నిఖిల కన్‌స్ట్రక్షన్స్ సేవా కార్యక్రమాలు చేపడుతోందని తెలిపారు. కార్యక్రమంలో సురేష్, సిబ్బంది తదతరులు ఉన్నారు.

బెట్టింగ్‌లు, డ్రగ్స్‌కు దూరంగా ఉండాలి

● క్రీడా పోటీల ప్రారంభోత్సవంలో బూడిద రాంరెడ్డి



క్రీడాకారులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న రాంరెడ్డి తదితరులు

ఇబ్రహీంపట్నం, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): ఆన్‌లైన్ గేమ్స్, బెట్టింగ్, డ్రగ్స్‌కు యువత, విద్యార్థులు దూరంగా ఉండాలని బీఆర్ఆర్ ఫౌండేషన్ చైర్మన్ బూడిద రాంరెడ్డి అన్నారు. వ్యసనాలకు దూరంగా ఉంటూ యువత భవిష్యత్‌ను తీర్చిదిద్దుకోవాలని పిలుపునిచ్చారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా బీఆర్ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రెండు రోజులపాటు జరుగనున్న వాలీబాల్, ఖోఖో, కబడ్డీ క్రీడాపోటీలను శనివారం మండల పరిధి ఉప్పరిగూడ క్రాస్ రోడ్డులో ఆయన ప్రారంభించారు. నియోజకవర్గంలోని 44 ప్రభుత్వ పాఠశాలల నుంచి వెయ్యి మంది విద్యార్థులు పోటీల్లో పాల్గొంటున్నారు. విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతూ.. యువతకు డ్రగ్స్ పెనుభూతంలా మారాయన్నారు. తల్లిదండ్రులు ఎన్నో ఆశలతో పిల్లలకు చదువులకు పంపిస్తున్నారని, వారి కలలను సాకారం చేయాల్సిన బాధ్యత విద్యార్థులపై ఉందన్నారు. పోటీ ప్రపంచంలో నెగ్గాలంటే చదువులతోపాటు నైపుణ్యాన్ని పెంచుకోవాలన్నారు. అప్పుడే లక్ష్యాన్ని ఛేదించగలుగుతామన్నారు. డ్రగ్స్, చెడు వ్యసనాలకు దూరంగా ఉంటామని విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. క్రీడా పోటీల్లో పాల్గొన్న విద్యార్థులకు స్పోర్ట్స్ జెర్సీ కిట్లు, ఫైల్స్ అందజేశారు. కార్యక్రమంలో ఎస్సై సూర్యతేజ, నాయకులు నర్సింహారెడ్డి, పలు పాఠశాల ప్రధానోపాధ్యాయులు గిరిధర్, శ్రీనివాసులు, సుధాకర్, ఫిజికల్ డైరెక్టర్లు సుశీల, రాజు, పుణ్యశ్రీ, రమేష్ తదితరులు పాల్గొన్నారు.



వాలీబాల్ ఆడుతున్న బాలికలు


ఏకాంబర రామలింగేశ్వరాలయం

నేటి నుంచి నీళ్లపల్లి ఏకాంబరేశ్వరుడి జాతర

బషీరాబాద్, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): కొండకోనల మధ్య ఆటవీ ప్రాంతంలో సప్తగుండాల మధ్య వెలసిన నీళ్లపల్లి ఏకాంబర రామలింగేశ్వరస్వామి ఆలయం 28వ వార్షికోత్సవాలకు ముస్తాబైంది. ఆదివారం నుంచి మంగళవారం వరకు ఉత్సవాలు నిర్వహిస్తారు. 17న పల్లకి సేవ, గంధాలు, 18న జాతర, సాయంత్రం రథోత్సవం, 19న జాతర ముగింపు కార్యక్రమాలు ఉంటాయి. జాతరకు ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ పి.శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. ఈ చారిత్రక ఆలయంలో ఏటా శ్రావణమాస ఆఖరు ఆది, సోమ, మంగళవారాలు జాతర నిర్వహిస్తారు. భక్తులు మొదల సప్తగుండాల్లో స్నానమాచరించి ఆలయంలో శివయ్యను దర్శించుకుంటారు. ఉమ్మడి రంగారెడ్డి, మహబూబ్‌నగర్, మెదక్ జిల్లాలతో పాటు కర్ణాటకలోని సమీప ప్రాంతాల భక్తులు తరలి వస్తారు. ఈ ఆలయం పక్కనే ఉన్న పుష్కరిణిలో శ్రీరాముడి పరమభక్తుడైన యాకుబ్‌సాబ్ సజీవసమాధి మతసమైక్యతకు చిహ్నంగా భాసిల్లుతోంది. జాతరలో హిందూ, ముస్లింలు, ఇతర మతస్తులు పాల్గొంటారు. తాండూరు డీఎస్పీ బాలక్రిష్ణరెడ్డి, రూరల్ సీఐ నగేశ్ నేతృత్వంలో బందోబస్తు ఏర్పాటు చేశామని ఎస్ఐ నుమాన్‌అలీ తెలిపారు. ఈ జాతరకు తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి, పలువురు రాజకీయ నాయకులు, అధికారులు హాజరవుతారని ఆలయ కమిటీ చైర్మన్ తెలిపారు. భక్తుల కోసం విశాల ఏర్పాట్లు చేశామని చెప్పారు.

గ్యాస్ పైప్‌లైన్ లీక్



మేడ్చల్ టౌన్, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): మేడ్చల్-కిష్టాపూర్ రోడ్డు పక్కన స్తంభాలు పాతేందుకు శనివారం జరిపిన తవ్వకాల్లో భాగ్యనగర్ భూగర్భ గ్యాస్ పైప్‌లైన్ ధ్వంసమై గ్యాస్ లీకైంది. దీంతో పరిసర ప్రాంత ప్రజలు పరుగులు తీశారు. గ్యాస్ పైప్‌లైన్ పగిలిన విషయం గ్యాస్ కంపెనీకి సమాచారం ఇచ్చారు. కంపెనీ వారు వెంటనే ఘటనా స్థలానికి చేరుకొని పగిలిన పైప్‌నకు మరమ్మతు చేశారు. గ్యాస్ పైప్‌లైన్ పగిలి రెండుగంటల పాటు మేడ్చల్‌లో గ్యాస్ పరఫరా నిలిచింది. స్థానికులు వెంటనే అప్రమత్తం కావటంతో పెను ముప్పు తప్పింది.



కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

ఓటు చోరీ సిగ్గుచేటు

శంకర్‌పల్లి, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): ప్రధాని మోదీ ఓట్ల చోరీకి పాల్పడటం సిగ్గు చేటని జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి అన్నారు. కాంగ్రెస్ చేపట్టిన 'ఓట్ చోర్-ఘడీ చోర్' కార్యక్రమంలో భాగంగా శంకర్‌పల్లిలో శనివారం రాత్రి నియోజకవర్గ ఇన్‌చార్జి భీమ్‌భరత్ ఆధ్వర్యంలో కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. ప్రజాస్వామ్యంలో ఓటు చోరీతో అధికారంలోకి రావడం సిగ్గుచేటన్నారు. అంబేడ్కర్ రాజ్యాంగాన్ని బీజేపీ, జాతీయ ఎన్నికల కమిషన్ కాలరాయడం అన్యాయం అన్నారు. ఆధార్ నంబర్‌తో ఓటరు పేరును లింక్ చేయాలని డిమాండ్ చేశారు. చేవెళ్ల పార్లమెంటరీ పార్టీ ఇన్‌చార్జి బొంతు రామ్మోహన్ మాట్లాడుతూ... ఓటుహక్కును కాపాడుకునేందుకు ప్రజలంతా భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. చేవెళ్ల అసెంబ్లీ ఇన్‌చార్జి భీమ్‌భరత్ మాట్లాడుతూ.. దొంగ ఓట్లను గుర్తించి అధికారులకు ఫిర్యాదు చేయాలని అన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ రాష్ట్ర, జిల్లా నాయకులు శివసేనారెడ్డి, అనితారెడ్డి, గౌరీ సతీష్, జ్యోతి, పారిజాత, జ్ఞానేశ్వర్, కిషన్‌గుప్తా, వేణు, జనార్ధన్‌రెడ్డి, రవీందర్ రెడ్డి. శ్రీనాథ్‌గౌడ్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.


జైత్వారంలో పథకాలపై వివరిస్తున్న కృష్ణాగౌడ్

కేంద్ర పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

కందుకూరు, ఆగస్టు16(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని రాష్ట్ర కిసాన్ మోర్చా నాయకులు పల్లె కృష్ణాగౌడ్ కోరారు. శనివారం బీజేపీ మండల అధ్యక్షుడు నిమ్మ అంజిరెడ్డి ఆధ్వర్యంలో జైత్వారంలో నిర్వహించిన 'సంపర్క్ అభియాన్'లో భాగంగా ఇంటింటికి కేంద్ర పథకాలపై వివరించారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ ప్రభుత్వాలు ప్రజలకు చేసిందేమీ లేదన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థుల గెలుపునకు కృషిచేయాలని శ్రేణులకు సూచించారు. బక్క మల్లేష్, రఘునందన్, చంద్రారెడ్డి, కుమ్మరి నర్సింహ, నవీన్, మధు, నరేందర్, ఆంజనేయులు, పాండు, రేవంత్ పాల్గొన్నారు.

మహనీయుడు.. కొర్వి కృష్ణస్వామి

కందుకూరు, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ నగరాభివృద్ధికి మాస్టర్ ప్లాన్ అందించిన మహనీయుడు కొర్వి కృష్ణస్వామి అని ముదిరాజ్ సంఘం మండల శాఖ అధ్యక్షుడు పిట్టల పాండు, గౌరవాధ్యక్షుడు కాకి రాములు అన్నారు. శనివారం కృష్ణస్వామి జయంతి వేడుకలను మండల కేంద్రంలోని హైదరాబాద్-శ్రీశైలం రహదారిపై నిర్వహించారు. కృష్ణస్వామి చిత్రపటానికి నివాళులర్పించారు. సంఘం నాయకులు సురేందర్, పి.లింగం, పి.ఆంజనేయులు, ఉదయ్‌కిరణ్, సుదర్శన్, పర్వతాలు, వెంకటేశ్, నర్సింహ, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కోనాపూర్ రోడ్డు విస్తరణకు శ్రీకారం

- రెండు లేన్ల రోడ్డుకు రూ.45కోట్లు మంజూరు

ఆమనగల్లు, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): కోనాపూర్ రోడ్డుకు మహర్దశ వచ్చింది. హైదరాబాద్-శ్రీశైలం రహదారి కోనాపూర్ గేట్ నుంచి ఆకుతోటపల్లి, దొడ్లపహాడ్, అప్పారెడ్డిపల్లిల మీదుగా మాడ్గుల వరకు 21కిలో మీటర్ల బీటీ రోడ్డు వైడెనింగ్‌కు ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. ఆర్అండ్‌బీ శాఖకు రూ.45కోట్లు కేటాయించింది. జూలై 11న మాడ్గులలో రోడ్డు విస్తరణ పనులకు మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, దామోదర్ రాజనర్సింహ, జూపల్లి కృష్ణారావు, ఎంపీ మల్లు రవి, ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి శంకుస్థాపన చేశారు. పనుల ప్రారంభానికి శనివారం కోనాపూర్ వద్ద రోడ్డు సర్వే మార్కింగ్ చేపట్టారు. రోడ్డు పనులు కానుండడంతో ఆమనగల్లు, మాడ్గుల మండలాల ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.


రోడ్డు విస్తరణకు మార్కింగ్ చేస్తున్న సిబ్బంది

టీబీ ముక్త్ భారత్‌కు బాధ్యతగా కృషి చేయాలి

(ఐదో పేజీ తరువాయి)

అవగాహన కల్పించాలని చెప్పారు. క్షయ వ్యాధి నిర్మూలనలో వికారాబాద్ జిల్లాను ఆదర్శంగా నిలపాలని, ఇతర జిల్లాలకు, రాష్ట్రానికి, దేశానికి జిల్లాను రోల్ మోడల్‌గా తీర్చిదిద్దడానికి ప్రణాళిక రూపొందించాలని నిర్వాహకులకు సూచించారు. ఈ సందర్భంగా అనంతగిరి కా హవా.. లాకో మరీజోంకా దవా.. అన్న నానుడిని గుర్తు చేసిన గవర్నర్ అనంతగిరిలోని మూలికలు, గాలి, వాతావరణం క్షయ వ్యాధి నివారణలో కీలక పాత్ర పోషించిన విషయాన్ని సదస్సు దృష్టికి తీసుకువచ్చారు.

సకాలంలో చికిత్స తీసుకోవాలి

శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ మాట్లాడుతూ క్షయకు సకాలంలో చికిత్స తీసుకుంటే వ్యాధి నుంచి త్వరగా కోలుకోవచ్చని చెప్పారు. క్షయ, ఛాతీ వ్యాధుల గురించి ప్రజలకు సరైన అవగాహన కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఆయన అన్నారు. ఈ సందర్భంగా క్షయ వ్యాధి నివారణలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన వివిధ జిల్లాల అధికారులు డాక్టర్ మల్లికార్జున్ (మహబూబ్‌నగర్), డాక్టర్ రాజు (జోగులాంబ గద్వాల), డాక్టర్ సుమలత (ఆదిలాబాద్), డాక్టర్ పుల్లారెడ్డిలకు బంగారు పతకాలు, జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, గవర్నర్ ప్రిన్సిపల్ సెక్రటరీ దానకిషోర్, జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్, ఎస్పీ నారాయణ రెడ్డి, ట్యూబర్ క్యూలోసిస్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ చైర్మన్ డాక్టర్ సుధీర్ ప్రసాద్, డాక్టర్లు దీనదయాళ్‌బాగ్, నరేందర్, బాలచందర్ తదితరులు పాల్గొన్నారు. అంతకు ముందు ముఖ్య అతిథిగా హాజరైన గవర్నర్ జిష్ణుదేవ్ వర్మకు స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సన్మానించి స్వాగతం పలికారు.


క్షయ నివారణకు ఉత్తమ సేవలు అందించిన వైద్యాధికారికి బంగారు పతకం, జ్ఞాపిక బహూకరిస్తున్న గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ

తీరిన లోటు.. పెరిగిన సాగు



(ఐదో పేజీ తరువాయి)

సీజన్‌లో 80శాతమైన సాగు పూర్తవుతుందా? అనే అనుమానాలు తలెత్తాయి. అయితే గడిచిన మూడు వారాలుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో లోటు తీరి వ్యవసాయం గాడిన పడింది. వాతావరణ అనుకూల పరిస్థితుల కారణంగా మూడు జిల్లాల్లో గడిచిన మూడు వారాలుగా పంటలు సాగు గణనీయంగా పెరిగింది. వికారాబాద్ జిల్లాలో ఈ సీజన్‌లో 5,94,902 ఎకరాల్లో పంటలు సాగవుతాయని వ్యవసాయ శాఖ అధికారులు అంచనా వేశారు. అయితే జిల్లాలో ఇప్పటి వరకు 81 శాతం పూర్తయింది. రంగారెడ్డి జిల్లాలో 3,85,011 ఎకరాల్లో పంటలు సాగవుతాయని అంచనా వేయగా ఇప్పటి వరకు 72 శాతం పూర్తయింది. అలాగే మేడ్చల్ జిల్లాలో 23,430 ఎకరాల్లో పంటలు వేయాలని లక్ష్యంగా నిర్ణయించగా ఇప్పటి వరకు 65 శాతం రైతులు పంటలు వేశారు.

రికార్డుస్థాయిలో పత్తి, మొక్కజొన్న

విస్తారంగా వర్షాలు కురడంతో మూడు జిల్లాల్లో పత్తి, మొక్కజొన్న, కంది పంటలు సాగు బేష్‌గా ఉంది. వికారాబాద్ జిల్లాలో రికార్డు స్థాయిలో పత్తి సాగు పెరిగింది. ఈ ఏడాది జిల్లాలో పత్తి పంటను 2.44 లక్షల ఎకరాల్లో సాగు చేయాలని లక్ష్యంగా నిర్ణయించగా ఇప్పటికే అంతకు మించి రైతులు 2.49 లక్షల ఎకరాల్లో పంట వేశారు. అలాగే రంగారెడ్డి జిల్లాలో మొకజొన్న విస్తీర్ణం గణనీయంగా పెరిగింది. ఈ సీజన్‌లో మొక్కజొన్న 56వేల ఎకరాల్లో సాగవుతుందని అంచనా వేయగా ఇప్పటికి దాదాపు 64వేల ఎకరాల్లో రైతులు సాగు చేశారు. రంగారెడ్డి జిల్లాలో ఈ సీజన్‌లో 1.62లక్షల ఎకరాల్లో పత్తి సాగు చేయాలని లక్ష్యంగా నిర్ణయించగా ఇప్పటి వరకు 1.38 లక్షల ఎకరాల్లో సాగు చేశారు. వికారాబాద్ జిల్లాలో కంది పంట 1.47లక్షల ఎకరాల్లో సాగు చేయాలని లక్ష్యంగా నిర్ణయించగా ఇప్పటి వరకు 1.05 లక్షల ఎకరాల్లో కంది పంట వేశారు. అయితే వరి సాగు ఇంకా పెరగలేదు. ఇంకా భారీ వర్షాలు పడుతుండడంతో వరి నాట్లపై ప్రభావం పడుతోంది. దీంతో వరి నాట్లు ఆశించిన స్థాయిలో జరగడం లేదు. వికారాబాద్‌లో వరి పంటసాగు 60 శాతానికిపైగా పూర్తికాగా రంగారెడ్డి జిల్లాలో 50శాతం కూడా నాట్లు వేయలేదు.

జూలై, ఆగస్టులో భారీగా..

గత జూన్‌నెలలో మేడ్చల్ జిల్లాలో 75శాతం లోటు వర్షపాతం నమోదు కాగా, వికారాబాద్ జిల్లాలో 44శాతం , రంగారెడ్డి జిల్లాలో 25శాతం సగటు కంటే తక్కువ వర్షం కురిసింది. అయితే జులై, ఆగస్టు నెలల్లో వర్షాలు భారీగా పడ్డాయి. దీంతో మూడు జిల్లాల్లో వానాకాలం సగటు వర్షపాతం కంటే అధిక వర్షపాతం నమోదైంది. రంగారెడ్డి జిల్లాలో ఈ సీజన్‌లో ఇప్పటి వరకు 318మి.మీ వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా ఇప్పటి వరకు 516 మి.మీ వర్షం కురిసింది. వికారాబాద్ జిల్లాలో 390మి.మీ వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా 515మి.మీ వర్షం కురిసింది. మేడ్చల్ జిల్లాలో 357మి.మీ వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా 440మి.మీ వర్షం కురిసింది. ఈ మూడు జిల్లాల్లో జూలైలో సగటుకు మించి వర్షం కురవగా ఆగస్టు నెలలో కూడా ఇప్పటికే సగటుకు మించి వర్షపాతం నమోదైంది.

హామీ మేరకు పెన్షన్లను పెంచాలి

- లేకుంటే ప్రభుత్వంతో తాడోపేడో తేల్చుకుంటాం
- పోరాటాల్లో వెనకబడిన కమ్యూనిస్టులు
- ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ


సమావేశంలో మాట్లాడుతన్న మందకృష్ణ మాదిగ

తాండూరు/పరిగి, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు పింఛన్లను వెంటనే పెంచాలని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ అన్నారు. శనివారం దివ్యాంగుల హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో తాండూరు పట్టణంలో ఏర్పాటు చేసిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనకు పదవులు ఇస్తామని చాలా పార్టీల నుంచి ఆఫర్లు వచ్చాయని ఆ ఆఫర్లకు లొంగకుండా, ఎమ్మార్పీఎస్ లక్ష్యం దెబ్బతినకుండా ముందుకు సాగుతున్నామన్నారు. గతంలో భూ పోరాటలు చేసిన వామపక్షాలు, ప్రస్తుతం వెనుకబడి పోయాయన్నారు. ఎన్నికల్లో హామీ ఇచ్చి 20 నెలలు అయినా అమలు చేయడం లేదన్నారు. పొరుగున ఉన్న చంద్రబాబు ప్రభుత్వం తక్షణమే అమలు చేసిందని గుర్తు చేశారు. పింఛన్ల పెంపు విషయంపై ప్రభుత్వంతో తాడోపేడో తెల్చుకుంటామని ఇందులో భాగంగా సెప్టెంబర్ 3న హైదరాబాద్‌లో మహాగర్జన సదస్సు నిర్వహిస్తున్నామని తెలిపారు. రాష్ట్రంలో ప్రతిపక్షాలు పోషించని పాత్రను ఎమ్మార్పీఎస్ పోషిస్తుందన్నారు. సమావేశంలో ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు కొడగంటి మల్లికార్జున్, సూర్య ప్రకాశ్, దివ్యాంగుల హక్కుల పోరాట సమితి అధ్యక్షులు చంద్ తదితరులు పాల్గొన్నారు.

పెన్షన్లు పెంచకుంటే గద్దె దించుతాం

దివ్యాంగుల పెన్షన్లు పెంచుతావా? గద్దె దిగుతావా... అంటూ ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ అన్నారు. త్వరలో నిర్వహించనున్న మహాగర్జనకు సంబంధించి శనివారం పరిగిలో నిర్వహించిన సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. పెన్షన్లు పెంచకపోతే, కేసీఆర్‌ను ఎలా గద్దె దించామో...? సీఎం కుర్చీ నుంచి రేవంత్‌ను కూడా దించుతామని స్పష్టం చేశారు. సమావేశంలో దివ్యాంగుల హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు ఊరడి శ్యాంప్రసాద్, సంఘం నాయకులు మంజులారెడ్డి, నస్కంటి సురేశ్, వినోద్, ఆనందం, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో ప్రజారంజక పాలన


లబ్దిదారుకు ఎల్వోసీ అందజేస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

ఆమనగల్లు, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజారంజకంగా పాలన సాగిస్తోందని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలతో ప్రజలకు భద్రత, భరోసా ఏర్పడిందని తెలిపారు. ఆమనగల్లు, కడ్తాల మండలాల్లో శనివారం ఎమ్మెల్యే పర్యటించి అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. పనులు నాణ్యతతో వేగవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు. పేదలకు మంజూరైన చెక్కులను, ఎల్‌వోసీలను అందజేశారు. ఆయన మాట్లాడుతూ.. పేద, మధ్యతరగతి ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పథకాలను అమలు చేస్తున్నారని చెప్పారు. పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు, రేషన్‌కార్డులు ఇస్తామని తెలిపారు. ఆయా కార్యక్రమాల్లో నాయకులు కల్లు రమణారెడ్డి, వెంకటేశ్, శ్రీనివాస్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి, జగన్, వెంకటేశ్వర్లు, శంకర్, రవి, దశరథ్ రెడ్డి, కొండల్‌రెడ్డి, తాళ్ల రవీందర్, సాయిరెడ్డి పాల్గొన్నారు.

గౌడ భవన నిర్మాణానికి నిధులు కేటాయించండి

ఆమనగల్లులోని కాటమయ్యగుట్టపై గౌడసంక్షేమ భవనం నిర్మాణానికి నిధులు కేటాయించాలని సంఘం నాయకులు ప్రభుత్వాన్ని కోరారు. శనివారం ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డిని హైదరాబాద్‌లో కలిసి వినతిపత్రం ఇచ్చారు. సర్దార్ సర్వాయిపాపన్న గౌడ్ విగ్రహం పక్కన గౌడ సంక్షేమ భవనం నిర్మాణానికి ప్రభుత్వం నుంచి రూ.కోటి మంజూరు చేయించాలని కోరారు. అలాగే ఆదివారం ఆమనగల్లులో నిర్వహించే కాటమయ్య బోనాలకు రావాలని ఎమ్మెల్యేకు ఆహ్వానాన్ని అందజేశారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో సంఘం అధ్యక్షుడు చుక్కా అల్లాజిగౌడ్, పీసీసీ సభ్యుడు ఆయిళ్ల శ్రీనివాస్‌గౌడ్, యాచారం వెంకటేశ్వర్లుగౌడ్, గంగ రవీందర్‌గౌడ్, దూసకంటి యాదయ్య గౌడ్, నిరంజన్‌గౌడ్, జగన్‌గౌడ్ ఉన్నారు.

ప్రజారోగ్యానికి... మొబైల్ హెల్త్ క్యాంపులు

- నేడు మేడిగడ్డలో ప్రారంభం
- ఐక్యతా ఫౌండేషన్ చైర్మన్ రాఘవేందర్‌రెడ్డి


మాట్లాడుతున్న రాఘవేందర్‌రెడ్డి

ఆమనగల్లు, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): కల్వకుర్తి నియోజకవర్గ ప్రజల సంపూర్ణ ఆరోగ్యమే లక్ష్యంగా ఐక్యతా ఫౌండేషన్ ఆధ్వర్యంలో మొబైల్ హెల్త్ క్యాంప్‌లు నిర్వహిస్తోందని ఫౌండేషన్ చైర్మన్, టాస్క్ సీవోవో సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి తెలిపారు. ఆమనగల్లులోని ఫౌండేషన్ కార్యాలయంలో శనివారం రాఘవేందర్‌రెడ్డి మాట్లాడారు. మేడిగడ్డ తండాలో ఆదివారం మొబైల్ వైద్య క్లినిక్‌లు ప్రారంభిస్తామని తెలిపారు. బస్సుతో ప్రతీ గ్రామంలో ఇంటింటికి తిరిగి ప్రతీ వ్యక్తి గుండె, లివర్, కిడ్నీ, మధుమేహ పరీక్షలు నిర్వహిస్తామని తెలిపారు. సకాలంలో వైద్య పరీక్షలతో ఏమైనా వ్యాధి ఉంటే గుర్తించి వెంటనే చికిత్స చేయించుకుంటే ప్రజలకు మేలు కలుగుతుందన్నారు. ప్రతీ వారం ఓ గ్రామంలో మొబైల్ క్లినిక్ నిర్వహిస్తామన్నారు. 2028 సంవత్సరం వరకు ఈ కార్యక్రమాన్ని కొనసాగిస్తామన్నారు. ఐక్యతా ఫౌండేషన్ వైద్య సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సమావేశంలో చెంచు సంఘం రాష్ట్ర నాయకుడు మండ్లి రాములు, ఫౌండేషన్ సభ్యులు రచ్చ శ్రీరాములు, అభినవ్‌రెడ్డి, మల్లేశ్, కొండల్ పాల్గొన్నారు.

'మార్వాడీ గో బ్యాక్'పై ఇంటలిజెన్స్ ఆరా

ఆమనగల్లు, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): మార్వాడీ వ్యాపారులు వెనక్కు వెళ్లాలంటూ.. 'మార్వాడీ గో బ్యాక్' పేరిట ఈ నెల 18న ఆమనగల్లు బంద్‌కు పిలుపిచ్చిన నేపథ్యంపై ఇంటలిజెన్స్ అధికారులు ఆరా తీస్తున్నారు. స్థానిక కిరాణా, వర్తక, వస్త్ర, బంగారం వ్యాపారులు మార్వాడీ వ్యాపారులకు వ్యతిరేకంగా నిరసనలకు సిద్ధమవుతున్నారు. గత శుక్రవారం కరపత్రాలు ముద్రించి దుకాణల్లో పంచారు. సోషల్ మీడియాలో వైరల్ చేశారు. ఈ అంశం రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. 'మార్వాడి గో బ్యాక్' ఆందోళనల వెనుక ఏ రాజకీయ పార్టీ అయినా ఉందా? దీన్ని ఎవరు లేవనెత్తారు? అనే కోణంలో ఇంటలిజెన్స్ ఆరా తీస్తోంది. శనివారం ఆమనగల్లులో కొందరు నిఘా అధికారులు వివరాలు సేకరించినట్లు తెలిసింది. ఆమనగల్లు ప్రాంతం లో మార్వాడీ వ్యాపారులు ఎంత మంది, ఏం వ్యాపారాలు చేస్తున్నారు? స్థానిక వ్యాపారులకు వస్తున్న ఇబ్బందులేమిటి? అనే వివరాలు సేకరించినట్లు తెలిసింది. మార్వాడి దుకాణాలతో స్థానికులకు ఉపాధి లభిస్తోందా? అనే దానిపైనా ఆరా తీసినట్లు తెలిసింది. కాగా మార్వాడీలు నాసిరకం వస్తువులను అమ్ముతున్నారని స్థానిక వ్యాపారుల పేరిట ముద్రించిన కరపత్రంలో పేర్కొన్నారు. రేపటి బంద్‌పిలుపు నేపథ్యంలో నిఘా అధికారులు అన్ని వర్గాల నుంచి సమాచారాన్ని సేకరించి ప్రభుత్వానికి అందజేస్తున్నారు.

బంద్ నిర్ణయం ఉప సంహరణ

ఆమనగల్లులో ఈ నెల 18న తలపెట్టిన బంద్‌ను స్థానిక వ్యాపారులు విరమించుకున్నారు. ఈ మేరకు శనివారం రాత్రి వారు ఓ ప్రకటన విడుదల చేశారు. కాగా పోలీసుల సూచనలతో బంద్‌ను వాయిదా వేసినట్లు సమాచారం. మార్వాడి వ్యాపారులతో జరిపిన చర్చలు సఫలమై ఈ నిర్ణయాన్ని తీసుకున్నట్లు స్థానిక వ్యాపారులు సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేశారు.

సౌదీలో దేశభక్తిని చాటిన పరిగి వాసి



పరిగి,ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): సౌదీ అరేబియాలో పరిగి వాసి దేశభక్తిని చాటాడు. పరిగికి చెందిన ఇసాక్‌అలీ సౌదీ వెళ్లాడు శుక్రవారం స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా సౌదీలోని మదీనా షరీఫ్ వద్ద భారత జాతీయ జెండాను ప్రదర్శించాడు. ఆ ఫొటోలను స్నేహితులకు పంపాడు.

ప్రశాంతంగా పండుగలు జరుపుకోవాలి


సమావేశంలో మాట్లాడుతున్న సీఐ రాజువర్మ

ఘట్‌కేసర్ రూరల్, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): ప్రశాంత వాతావరణంలో పండుగలు జరపాలని పోచారం ఐటీ కారిడార్ స్టేషన్ సీఐ రాజువర్మ తెలిపారు. శనివారం పీస్(శాంతి) కమిటీ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. వినాయక చవితి ప్రశాంతంగా జరుపుకోవాలని సూచించారు. ఎవరైనా అల్లర్లకు పాల్పడినా, కారకులైనా చర్యలు తప్పవని హెచ్చరించారు. వినాయక మండపాలకు అనుమతి తీసుకోవాలని, డీజేలు పెట్టొదని తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఐలు శివకృష్ణ, నాగేశ్వర్‌రావు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు పనులు త్వరగా పూర్తిచేయాలి


మాట్లాడుతున్న తండా వాసులు

దుద్యాల, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): ఈర్లపల్లి ప్రధాన రోడ్డు నుంచి సంద్రకుంట తండా వరకు చేపట్టిన పనులను త్వరగా పూర్తి చేయాలని తండావాసులు కోరారు. కొన్ని నెలలుగా నిర్మాణ పనులు నిలవడంతో ఇబ్బందులు తప్పడం లేదన్నారు. వర్షాలకు మట్టి కొట్టుకుపోయి రాకపోకలకు అవస్థలు పడుతున్నామని వాపోయారు. అధికారులు స్పందించి రోడ్డు పనులను వేగవంతం చేసేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు.

రూ.30కోట్లతో డబుల్ రోడ్డు పనులు


బషీరాబాద్‌లో చేపడుతున్న రోడ్డు విస్తరణ పనులు

బషీరాబాద్, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి):బషీరాబాద్‌లోని రైల్వేగేటు నుంచి జీవన్గి బ్రిడ్జి మీదుగా కరణ్‌కోట్ వరకు చేపట్టే డబుల్ రోడ్డు పనులు శనివారం ప్రారంభమయ్యాయి. రోడ్డుకు రూ.30కోట్లు మంజూరయ్యాయి. మూడు నెలల కిందట కాంట్రాక్టర్ జీవన్గి వైపు నుంచి పనులు చేపట్టారు. మధ్యలో పనులు పడకేశాయి. మూడు రోజుల కిందట ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి ఆర్అండ్‌బీ అధికారులతో సమీక్షించారు. కాంట్రాక్టర్‌తో చర్చించిన పనుల ప్రారంభానికి చర్యలు తీసుకోగా కాంట్రాక్టర్ పనులను మొదలుపెట్టారు. రైల్వే గేటు మలుపు నుంచి జీవన్గి రోడ్డు పోచమ్మ ఆలయం వరకు సీసీ డబుల్‌రోడ్డును నిర్మించనున్నారు.


పెద్ద చెరువు గండి వద్ద పూడ్చివేతకు చర్యలు చేపట్టిన అధికారులు

నవాంద్గీ చెరువుకు గండి పూడ్చివేత

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

బషీరాబాద్, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): నవాంద్గీ పెద్ద చెరువుకు పడిన గండిని నీటి పారుదల శాఖ అధికారులు శనివారం పూడ్చారు. ఇరిగేషన్ వర్క్ ఇన్‌స్పెక్టర్ శ్రావణ్, సిబ్బంది చెరువు తూము గండిని ఇసుక బస్తాలతో తాత్కాలికంగా పూడ్చారు. 'నవాంద్గీ పెద్ద చెరువుకు గండి' శీర్షికన 11వ ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన వార్తకు ఇరిగేషన్ అధికారులు స్పందించి మండల అధికారులను అప్రమత్తం చేశారు. గండి శాశ్వత పనులకు నిధుల మంజూరుకు ప్రభుత్వానికి నివేదిక పంపించినట్లు వర్క్ ఇన్‌స్పెక్టర్ శ్రావణ్ తెలిపారు.

వైభవంగా కృష్ణాష్టమి

వికారాబాద్, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాల్లో కృష్ణాష్టమి వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయాలు, ఇళ్లలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పాఠశాలల్లో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాల్లో శ్రీకృష్ణ, గోపికల వేషధారణలో సందడి చేశారు.


వికారాబాద్‌లో శ్రీకృష్ణ, గోపిక వేషధారణలో చిన్నారులు


మర్పల్లి: శ్రీకృష్ణ, గోపికల వేషధారణలో చిన్నారులు



పరిగిలోని చిన్ని కృష్ణుని వేషధారణలో చిన్నారులు


కృష్ణుడి వేషధారణలో చిన్నారి


తాండూరులోని సాయిమేధ స్కూల్‌లో కృష్ణుడికి డోలారోహణం నిర్వహిస్తున్న ఉపాధ్యాయుల బృందం


దోమ: కృష్ణ, గోపికల వేషధారణలో చిన్నారులు


కీసర రూరల్: నాగారం మున్సిపాలిటీలో నిర్వహించిన ర్యాలీలో గోపిక, కృష్ణుడి వేషధారణలో చిన్నారులు


చౌడాపూర్: మమరికల్‌లో..

నాగారం, ఘట్‌కేసర్‌లో
భారీ వర్షం

(ఐదో పేజీ తరువాయి)

వాహనదారులు తీవ్ర అసహనం వ్యక్తం చేశారు.. దీంతో పాటు బీఎంఆర్ ఎన్‌క్లేవ్, సాయి సంజీవనగర్ తదితర కాలనీల్లో వరద నీరు చేరింది.

ఏడుగంటలు ఏకధాటిగా..

ఘట్‌కేసర్: ఘట్‌కేసర్, పోచారం మున్సిపాలిటీల పరిధిలో శుక్రవారం రాత్రి భారీ వర్షం కురిసింది. రాత్రి 10గంటల నుంచి ప్రారంభమైన వర్షం శనివారం ఉదయం వరకు 41.8మిల్లీమీటర్ల వర్షం కురిసింది. ఏడు గంటలు ఏకధాటిగా వర్షం కురువడంతో చెరువులు, కుంటల్లో అడుగు మేర వరదనీరు చేరింది. ఘట్‌కేసర్‌కు ఎగువన ఉన్న కీసర మండలంతోపాటు నగరంలోని కుషాయిగూడ, ఈసీఐఎల్ ప్రాంతాల్లోను వర్షం కురవడంతో ఘట్‌కేసర్ మండలంలోని ఎరిమల్లెవాగు వరదనీటితో ప్రవహించింది.

పొంగిపొర్లిన వాగులు, చెరువులు

మోమిన్‌పేట్: కురుస్తున్న భారీ వర్షాలకు మోమిన్‌పేట్ మండలంలోని చెరువులు, వాగులు పొంగిపొర్లుతున్నాయి. కాస్లాబాద్ పరిధిలోని నందివాగు ప్రాజెక్టులోకి వరద నీరు భారీగా చేరడంతో అలుగు పారింది. టేకులపల్లి, ఎన్కతల, దేవరంపల్లి, దుర్గం చెరువుల్లోకి వరద నీరు భారీగా చేరింది.

ఘనంగా కొరివి కృష్ణస్వామి జయంతి


పరిగిలో కొరివి కృష్ణస్వామికి నివాళులర్పిస్తున్న ముదిరాజ్ సంఘం నాయకులు

పరిగి, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): ముదిరాజ్ ముద్దుబిడ్డ, హైదరాబాద్ నగర తొలిమేయర్ కొవిరి కృష్ణస్వామి ముదిరాజ్ 132వ జయంతి వేడుకలను శనివారం పరిగిలో నిర్వహించారు. పరిగిలోని కృష్ణస్వామి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ముదిరాజ్ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి డి.మాణిక్యం, పరిగి నియోజకవర్గ అధ్యక్ష కార్యదర్శులు దోమ రాంచంద్రయ్య, డి.కృష్ణ, మాజీ మున్సిపల్ చైర్మన్ ఎం.అశోక్, ముదిరాజ్ సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎం.నాగేశ్వర్‌లు మాట్లాడుతూ నిజాం రాజ్యముదిరాజ్ మహాసభ వ్యవస్థాపక తొలి అధ్యక్షుడిగా సేవలు అందించారని తెలిపారు. తొలి మేయర్‌గా, ఫిక్టోరియల్ ఆఫ్ హైదరాబాద్ పుస్తక రచయిత కృష్ణస్వామి సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. కృష్ణస్వామి ఆశయసాధనకు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు దోమ శ్రీశైలం, బాబయ్య, బందెయ్య, రమేశ్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

మందకృష్ణ మాదిగకు వినతి

పరిగి, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): ఆడక్వసీ పదాన్ని తొలగించాలని కోరుతూ తెలంగాణ మాదిగ టీచర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో శనివారం పరిగికి వచ్చిన ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణమాదిగకు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా మాదిగ టీచర్స్ ఫెడరేషన్ నాయకులు మాట్లాడుతూ.. జీవో నంబరు 2లోని ఆడక్వసీ నిబంధనను తొలగించాలని కోరారు. ఆర్టికల్ 16(4)ప్రకారం ఏ రాష్ట్రం అయినా తగిన ప్రాతినిధ్యం లేని వర్గాలకు ప్రత్యేక రిజర్వేషన్లు ఇవ్వవచ్చని తెలిపారు. అయితే ఆడక్వసీ చేర్చడం వల్ల 16(4)ఆర్టికల్ ఉల్లంఘన జరుగుతోందని తెలిపారు. ఎస్సీ, ఎస్టీ ఉద్యోగులకు పదోన్నతుల్లో ఎస్సీలకు 15శాతం, ఎస్టీలకు పదిశాతానికే పరిమితం చేస్తూ, ఆవర్గాల పేరున ఖాళీ అయిన పోస్టు ఇతర వర్గాలకు కేటాయిస్తూ రిజర్వేషన్ పదాన్ని తూట్లు పొడుస్తున్నారని తెలిపారు. వినతిపత్రం ఇచ్చినవారిలో మాదిగ టీచర్స్ ఫెడరేషన్ నాయకులు అంజయ్య, బుగ్గయ్య, బుచ్చయ్య, వెంకటయ్య, జైపాల్, నర్సింహులు, జంగయ్య, బసప్ప, అంజనేయులు ఉన్నారు.

ఆలయాన్ని పునర్నిర్మించాలి

పరిగి, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): పరిగిలోని శ్రీకృష్ణాష్టమి సందర్భంగా పరిగిలోని శ్రీవేణుగోపాలస్వామి ఆలయంలో బీజేపీ ఆధ్వర్యంలో శనివారం శ్రీకృష్ణుడికి పూజలు చేశారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు మాట్లాడుతూ.. పురాతనమైన వేణుగోపాలస్వామి ఆలయం గతంలో విరాజిల్లిందన్నారు. ఈ ఆలయాన్ని ప్రభుత్వం పట్టించుకోలేదని తెలిపారు. ఇప్పటికైనా దేవాదాయ శాఖ స్పందించి ఆలయాన్ని పునర్నిర్మించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు సదానందరెడ్డి, పార్టీ నాయకులు రాంచందర్, బాలకిష్టారెడ్డి, నాగేశ్, శ్రీనివాస్ ఉన్నారు.

పాంబండ ఆలయంలో ప్రత్యేక పూజలు


పాంబండ ఆలయంలో జిల్లా కోర్టు పీపీ సుధాకర్‌రెడ్డి కుటుంబ సభ్యులను సన్మానిస్తున్న ఆలయ చైర్మన్ మైపాల్‌రెడ్డి

కులకచర్ల, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బండవెల్కిచర్ల పాంబండ ఆలయాన్ని శనివారం వికారాబాద్ జిల్లా కోర్టు పీపీ సుధాకర్‌రెడ్డి కుటుంబసభ్యులతో దర్శించుకున్నారు. శ్రీ రామలింగేశ్వరస్వామికి వారితో పూజారి పాండుశర్మ అభిషేకం, ప్రత్యేక పూజలు చేయించారు. ఈ సందర్భంగా పీపీ సుధాకర్‌రెడ్డి, కుటుంబసభ్యులను ఆలయ చైర్మన్ కోట్ల మైపాల్‌రెడ్డి సన్మానించారు.

23 నుంచి రామలింగేశ్వరస్వామి జాతర

మోమిన్‌పేట్: శ్రావణమాసంలో వచ్చే శ్రీ రామలింగేశ్వరస్వామి జాతర ఉత్సవాలు నెల రోజుల పాటు జరుగుతాయని వేద పండితులు మల్లేశం తెలిపారు. జూలై 23 నుంచి ఆగస్టు 24 వరకు శ్రావణ మాసం సందర్భంగా శ్రీ రామలింగేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు.

కమ్యూనిస్టులంతా ఒకే ఎజెండా కిందకు రావాలి

(ఐదో పేజీ తరువాయి)

ఉన్నాయని విన్నవించారు. అలాగే తెలంగాణ ఉద్యమకారులను ఆదుకోవాలని ఉమ్మడి రంగారెడ్డి జిల్లా తెలంగాణ ఉద్యమకారుల సంఘం అధ్యక్షుడు ఈడిగి సంజయ్‌గౌడ్ సైతం కూనంనేనికి వినతి పత్రం ఇచ్చారు.

సీసీఐకి సౌకర్యాలు కల్పించండి

తాండూరు రూరల్: తాండూరు మండలం కరన్‌కోట్ ప్రభుత్వ రంగ సీసీఐ కర్మాగారంలో కావాల్సి సౌకర్యాలు కల్పించాలని కోరుతూ కార్మికులు, సీపీఐ నాయకుల కూనంనేకి వినతి పత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ కర్మాగారంలోన ప్యాకింగ్ ప్లాంట్, సిమెంటు మిల్లు, నిల్వ కోసం క్లింకర్‌లో ఆధునీకరణకు రూ.70కోట్లు అవసరం ఉందని తెలిపారు. ఏడాదికి 36 రాక్‌లకు బొగ్గు లింకేజీ ఇవ్వాలని కోరారు. తాండూరులో అత్యవసరంగా అవసరమైన ఈఎస్ఐ ఆసుపత్రి ఏర్పాటుకు కృషి చేయాలని వారు కోరారు. వినతిపత్రం ఇచ్చినవారిలో మాజీ ఎంపీటీసీ, కాంగ్రెస్ సీనియర్ నాయకులు మైలారం రాజ్‌కుమార్, దస్తప్ప, తాహేర్, వెంకటేష్, రాజు తదితరులున్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత


చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే

తాండూరు రూరల్, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఐనెల్లికి చెందిన కుర్వ చంద్రమ్మ అనారోగ్యంతో హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. బాధిత కుటుంబానికి మంజూరైన రూ.2లక్షల 50వేల విలువ గల సీఎం సహాయనిధి చెక్కును ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి శనివారం అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు గోపాల్‌రెడ్డి, జైపాల్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

జల దిగ్బంధంలో
నవాంద్గి సంగమేశ్వరాలయం



బషీరాబాద్, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని నవాంద్గీ సంగమేశ్వరాలయం జలదిగ్బంధంలో మగ్గుతోంది. నాలుగైదు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు కాగ్నానది ఉధృతంగా ప్రవహిస్తూ ఆలయం చుట్టూ వరద నీరొచ్చిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో శనివారం కాగ్నానది ప్రవాహం కొంత మేరకు తగ్గినా ఆలయం ఇంకా జలదిగ్బంధంలోనే ఉండిపోయింది.

వాజ్‌పేయి సేవలు మరువలేనివి


మేడ్చల్‌టౌన్: వాజ్‌పేయికి నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

వికారాబాద్, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): భారత మాజీ ప్రధాని, భారత రత్న, బీజేపీ మార్గదర్శి అటల్ బిహారీ వాజ్‌పేయి సేవలు మరువలేనివని బీజేపీ నాయకులు అన్నారు. వాజ్‌పేయి వర్ధంతి సందర్భంగా శనివారం వికారాబాద్ బీజేపీ నాయకులు వాజ్‌పేయి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మాజీ అధ్యక్షుడు కోకట్ మాధవ రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కొట్టిగారి శివరాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి విజయ భాస్కర్‌రెడ్డి, సీనియర్ నాయకులు జి.పాండుగౌడ్, పి.నరోత్తంరెడ్డి, కేపీ రాజు, జిల్లా ఉపాధ్యక్షులు రాజేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

మేడ్చల్ టౌన్: వాజ్‌పేయి వర్ధంతిని శనివారం స్థానిక బీజేపీ నాయకులు ఘనంగా నిర్వహించారు. బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు విక్రమ్ రెడ్డి ఆధ్వర్యంలో గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీలో వాజ్‌పేయి చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘననివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గం కన్వీనర్ మోహన్ రెడ్డి, మాజీకౌన్సిలర్ దొడ్ల మల్లికార్జున్ ముదిరాజ్ పాల్గొన్నారు. మేడ్చల్ పట్టణంలో అధ్యక్షురాలు శైలజ హరినాథ్ ఆధ్వర్యంలో బీజేపీ నాయకులు వాజ్‌పేయి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

ఘట్‌కేసర్: దేశాభివృద్ధికి మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి అందించిన సేవలు మరువలేనివని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఏనుగు సుదర్శన్‌రెడ్డి అన్నాడు. వాజ్‌పేయి వర్ధంతి సందర్భంగా శనివారం పోచారం మున్సిపాలిటీ పరిధిలోని నారపల్లిలో ఆయన చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో రమేశ్, జగదీశ్, నాగరాజు, బిక్షపతి నరేశ్, శ్రీకాంత్, జానకిరామ్, నవీన్ పాల్గొన్నారు.


వికారాబాద్: వాజ్‌పేయి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు


ఘట్‌కేసర్: వాజ్‌పేయి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న సుదర్శన్‌రెడ్డి

20న ఉచిత అవగాహన సదస్సు

వికారాబాద్, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): పోటీపరీక్షలకు సంబంధించి లాంగ్ టర్మ్ బ్యాచ్‌పై అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు ఏకేఆర్ స్టడీ సర్కిల్ డైరెక్టర్లు రమణ, స్రవంతి ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 20వ తేదీ ఉదయం 9గంటలకు స్థానిక ఏకేఆర్ స్టడీ సర్కిల్‌లో ఈ సదస్సు నిర్వహిస్తామని పేర్కొన్నారు. సదస్సులో రాష్ట్ర స్థాయి అధ్యాపక బృందం పరీక్షలకు ఉపయోగపడే విధమైన విలువైన మార్గదర్శకాన్ని అందిస్తారని తెలిపారు.మరిన్ని వివరాలకు 9441022571 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

మహాసభలకు తరలిన సీపీఐ నాయకులు

కొడంగల్, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): తాండూర్‌లోని సమద్ ఫంక్షన్ హాల్‌లో శనివారం సీపీఐ జిల్లా కార్యదర్శి విజయలక్ష్మి పండిట్ ఆధ్వర్యంలో జరిగిన మహాసభలకు నియోజకవర్గ నాయకుడు జి.సురేశ్ కుమార్ ఆధ్వర్యంలో కొడంగల్ నుంచి తరలి వెళ్లారు. ఈ కార్యక్రమంలో సావిత్ర, ఆశమ్మ, శైలజ, అంజమ్మ, అనిత, బాబు, శంకర్‌నాయక్, అశోక్, హసేన్, బాబ్యానాయక్, గోవిందు పాల్గొన్నారు.

మల్లన్నగుట్ట జాతరకు ఏర్పాట్లు

కులకచర్ల, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): ఇప్పాయిపల్లి గ్రామ మల్లన్న గుట్ట జాతరకు ముస్తాబైంది. ప్రతీ సంవత్సరం శ్రావణమాసం చివరి ఆదివారం ఇక్కడ మల్లన్న జాతర కొనసాగుతోంది. గ్రామం నుంచి బోనాలతో మహిళలు బయల్దేరుతారు. అదేవిధంగా ఎడ్లబండ్లతో రైతులు మల్లన్న గుట్టకు చేరుకొని ప్రదక్షిణలు చేస్తారు. చుట్టు పక్కల గ్రామాల ప్రజలు పెద్దఎత్తున తరలివచ్చి స్వామివారిని దర్శించుకుంటారు. ఇందుకు నిర్వాహకులు తగు ఏర్పాట్లు పూర్తి చేశారు.

నేడు ధారూరులో లక్ష బిల్వార్చన

ధారూరు, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): ధారూరులోని శ్రీ వీరభద్రేశ్వర ఆలయంలో నేడు(ఆదివారం) లక్షబిల్వార్చన నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఆలయంలో ఉదయం నుంచి రుద్రాభిషేకం, లక్షబిల్వార్చన, పార్వతీదేవి కల్యాణం, మహా మంగళహారతి, పల్లకీసేవ ఊరేగింపు, అన్నదానం తదితర కార్యక్రమాలు కొనసాగుతాయని పేర్కొన్నారు. భక్తులు ఈ పూజా కార్యక్రమంలో అధిక సంఖ్యలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

పోలీసుల అవగాహన

బంట్వారం, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): సల్బాత్తాపూర్‌లో శుక్రవారం రాత్రి పోలీస్ శాఖ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పోలీస్ కళా బృందం ద్వారా సైబర్ నేరాలు, రోడ్ ప్రమాదాలు, మహిళలు, బాలల భద్రత అంశాలపై గ్రామస్థులకు వివరించారు. సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. రోడ్డు భద్రతా నియమాలు పాటించాలని సూచించారు. కార్యక్రమంలో బంట్వారం ఎస్ఐ విమల, పోలీస్ సిబ్బంది, కళాబృంద సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ

పరిగి, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): చిగురాల్‌పల్లిలో శనివారం వికారాబాద్ ఓం శాంతి నిలయంకు చెందిన బ్రహ్మకుమారి మధుఅక్కయ్య విద్యార్థులకు నోట్‌పుస్తకాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో జర్నలిస్ట్ నర్సింహా, అకారపు రాజు, ధర్మసమాజ్ పార్టీ పరిగి కన్వీనర్ కృష్ణ, నాయకులు జంగయ్య, అనంతయ్య, బాబు పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ సభకు తరలిన నాయకులు


పరిగి సభకు బయల్దేరుతున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

కులకచర్ల, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): పరిగిలో ఆదివారం జరిగిన ఎమ్మార్పీఎస్ సభకు కులకచర్ల నుంచి ఎమ్మార్పీఎస్ నాయకులు బయల్దేరి వెళ్లారు. చౌరస్తాలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నినాదాలు చేశారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు, పద్మశ్రీ అవార్డు గ్రహీత మందకృష్ణ మాదిగ సభలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్ష, కార్యదర్శులు కొమ్ము శ్రీనివాస్, భాను ప్రకాశ్, ఉపాధ్యక్షుడు మొగులయ్య, సలహాదారులు సురేశ్, వెంకటయ్య, మొగులయ్య, నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

పోగొట్టుకున్న సెల్‌ఫోన్ల అప్పగింత

బంట్వారం, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): పోగొట్టుకున్న సెల్‌ఫోన్లను తిరిగి అప్పగించామని శనివారం బంట్వారం ఎస్ఐ విమల తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. బంట్వారం పోలీస్‌స్టేషన్ పరిధిలోని తోర్మామిడికి చెందిన షహనాబేగం, రోంపల్లికి చెందిన పాండురంగారెడ్డిలకు సెల్‌ఫోన్‌ను అందించామన్నారు. వీరు సెల్‌ఫోన్లను ఆరునెలల కిందట పోగొట్టుకుని పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారని తెలిపారు. ఈ మేరకు సీఈఐఆర్ పోర్టల్ ద్వారా సెల్‌ఫోన్లను గుర్తించి రికవరీ చేశామని చెప్పారు.

ఉత్తమ అధికారులకు సన్మానం


అధికారులను సన్మానిస్తున్న కాంగ్రెస్ నాయకులు

దుద్యాల, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య వేడుకల్లో భాగంగా ఉత్తమ అధికారులుగా ఎంపికైన కొడంగల్ ఏఈ నాగేందర్, డీఈ సురేందర్‌రావు శుక్రవారం జిల్లా కేంద్రంలో కలెక్టర్ ప్రతీక్‌జైన్ చేతుల మీదుగా ప్రశంసాపత్రాలు అందుకున్నారు. ఈ సందర్భంగా శనివారం దుద్యాల మండలంలోని కుదురుమళ్ల గ్రామ కాంగ్రెస్ నాయకులు వారిని శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో నాయకులు నర్సింహులు, రఘుపతి, యాదగిరిరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, మాధవరావు, రమేశ్ గౌడ్ పాల్గొన్నారు.

బీజేపీ ఓట్ల చోరీపై ప్రజలకు అవగాహన


ఓటు చోరీ కరపత్రాలతో అవగాహన కల్పిస్తున్న కృష్ణంరాజు

కొడంగల్, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): బీజేపీ ఓట్ల చోరీపై యూత్ కాంగ్రెస్ జాతీయ కార్యదర్శి కృష్ణంరాజు ప్రజలకు అవగాహన కల్పించారు. స్థానిక ఆర్టీసీ బస్టాండ్‌లో శనివారం యూత్ కాంగ్రెస్ నాయకులతో కలిసి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రధాని మోదీ ప్రజల ఓట్లు కొల్లగొట్టి గద్దెనెక్కారని, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ బెంగళూర్‌లో చేపట్టిన ర్యాలీలో ఓట్ల చోరీ గురించి చాలా స్పష్టంగా ఈసీ, ప్రధాని మోదీ చేసిన అవకతవకలపై వివరించారన్నారు. గత లోక్‌సభ ఎన్నికల్లో 25స్థానాల్లో రిగ్గింగ్‌కు పాల్పడి ప్రధాని అయ్యారని ఆరోపించారు. రాహుల్‌గాంధీ సంధించిన ప్రశ్నలకు ఈసీ, ప్రధాని మోదీ స్పందించలేదన్నారు. ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ ఉపాధ్యక్షుడు కృష్ణంరాజు, సాయిలు, భాస్కర్, చిన్నయ్య పాల్గొన్నారు.

రోడ్డుపై పొంచి ఉన్న ప్రమాదం


అల్లాపూర్‌కు వెళ్లే దారిలో పడిన రంధ్రం

కులకచర్ల, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముజాహిద్‌పూర్ బీటీ రోడ్డు నుంచి అల్లాపూర్‌కు వెళ్లే మార్గంలో ప్రమాదం పొంచి ఉంది. కురిసిన వర్షాలకు రోడ్డు మధ్యలో రంధ్రంపడి ప్రమాదకరంగా మారింది. కొత్తవారు ఈ దారిమీదుగా వస్తూ ప్రమాదాల బారిన పడుతున్నారు. అధికారులు స్పందించి రోడ్డు మధ్యలో పడిన రంధ్రాన్ని పూడ్చి వేసేందుకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

కురుమ సంఘం వికారాబాద్ మండల నూతన కమిటీ


కురుమ సంఘం వికారాబాద్ మండల కమిటీ

వికారాబాద్, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): కురుమ సంఘం వికారాబాద్ మండల నూతన కమిటీని సంఘం పెద్దలు శనివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా మహేశ్, గౌరవ అధ్యక్షుడిగా గంగులు, ప్రధాన కార్యదర్శిగా సంగమేశ్, ఉపాధ్యక్షుడిగా గోపాల్, కోశాధికారిగా రాములు, కార్యదర్శిగా శంకరయ్య, కార్యవర్గ సభ్యులుగా వెంకటయ్య, బీరప్ప, మల్లేశంలను నియమించారు. ఈ కార్యక్రమంలో సంఘం పెద్దలు బొండల శ్రీనివాస్, గోపాల్, లింగయ్య, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

పూడూరు మండల నూతన కమిటీ

పూడూరు: కురుమ సంఘం పూడూరు మండల నూతన కమిటీని శనివారం ఎన్నుకున్నారు. రాష్ట్ర బీసీ సంఘం కృష్ణా, కమిటీ జిల్లా డైరెక్టర్ మల్లేశ్, కార్యదర్శి మల్లేశ ఆధ్వర్యంలో కమిటీ ఎన్నికను నిర్వహించారు. మండల కురుమ సంఘం నూతన అధ్యక్షుడిగా బొర్ర భూపాల్, గౌరవాధ్యక్షుడిగా దొడ్డి గోపాల్, ప్రధాన కార్యదర్శిగా బర్ల శివరాజ్, ఉపాధ్యక్షులుగా బర్ల వెంకటయ్య, రంగాపురం శివకుమార్, గొల్లగూడం మహేశ్‌లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

మహిళలకు రూ.26వేల కోట్ల రుణాలు

(ఐదో పేజీ తరువాయి)

అభివృద్ధి జరిగిందన్నారు. శాఖాపరంగా ప్రజలకు సేవ చేసేందుకు తన వంతుగా కృషి చేస్తానని తెలిపారు. చీఫ్‌విప్ పట్నం మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అంతకు ముందు భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ జగ్జీవన్‌రాం విగ్రహాలకు క్రేన్ సహాయంతో పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ ప్రతీక్‌జైన్, అదనపు కలెక్టర్లు లింగ్యానాయక్, సుధీర్, ఆర్డీవో వాసుచంద్ర, డీఆర్‌డీఏ శ్రీనివాస్, డీపీవో జయసుధ, డీటీడబ్ల్యూవో కమలాకర్ రెడ్డి, వ్యవసాయశాఖ అధికారి రాజారత్నం, పశుసంవర్ధక శాఖ అధికారి సదానందం, మాజీ జెడ్పీటీసీ కాలె జయమ్మ, పీఏసీఎస్ చైర్మన్ రామ్‌రెడ్డి, నాయకులు తలారి ప్రభాకర్, అనంత్ రెడ్డి, రవీందర్‌రెడ్డి, నాగిరెడ్డి, బాల్‌రాజ్ పాల్గొన్నారు. కాగా, నవాబుపేట మండలంలో పలు అభివృద్ధి పనుల ప్రారంభోత్సవానికి వచ్చిన మంత్రులు సీతక్క, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, ప్రభుత్వ చీఫ్‌విప్ పట్నం మహేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే కాలే యాదయ్య పర్యటన సందర్భంగా పూలపల్లి గేటు సమీపంలో బీజేపీ నాయకులను పోలీసులు ముందస్తుగా అరెస్టు చేశారు.